సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, ఆగస్టు 3 : ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేటర్ సబీహాబేగం, నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాజీవ్‌గాంధీనగర్,సఫ్దార్‌నగర్‌లో సమస్యలను తెలుసుకునేందుకు పాద యాత్ర నిర్వహించారు. సఫ్దార్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. ఇక రాజీవ్‌గాంధీనగర్‌లో వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై వరదనీరు చేరడంతో పాటు ఇండ్లలోకి కూడా ప్రవహిస్తున్నదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువుల్లో గుర్రపు డెక్క ఏపుగా పెరిగిపోవడం వలన దోమల సమస్య అధికమవుతుందని, రసాయనాలు పిచికారీ

రాజీవ్‌గాంధీనగర్ లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్ సబీహాబేగం

చేయడంతోపాటు గుర్రపు డెక్కను తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ విభాగం అధికారులకు సూచించారు. రాజీవ్‌గాంధీనగర్ నుంచి మైసమ్మ చెరువు వరకు అనుసంధానంగా ఉన్న పైపులైన్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. దీంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు వేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, లింగాల అయిలయ్య, వీరారెడ్డి, పిల్లి తిరుపతి, దుర్గ, రమేశ్, రియాజ్, హమీద్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్‌కు చెందిన పి.శామ్యూల్‌కు రూ.2 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్ఓసీ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ

నిరంతరాయంగా నీటి సరఫరా చేయాలి


ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వాటర్ ట్యాంకర్ల యజమానులు

దుండిగల్, ఆగస్టు 3: తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగించరాదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు జలమండలి అధికారులకు సూచించారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాటర్ ట్యాంకర్ యజమానులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శంభీపూర్‌లోని కార్యాలయంలో కలిసి, సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు. వాటర్ ట్యాంకర్ యజమానులు మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలనీలకు తాగునీటి ఎద్దడి ఉన్నందున శుక్రవారం కొన్ని కారణాల వలన వివిధ ప్రాంతాల్లో వాటర్ సంపులను ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సీజ్ చేసిన వాటర్ సంపులను యథావిధిగా కొనసాగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రమేశ్, స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సదరం క్యాంపులు

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3: మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో 8, 22, 29 తేదీల్లో సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శనివారం తెలిపారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు మీ-సేవ ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్ రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్, లేటెస్ట్ రిపోర్ట్స్‌తో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. 5వ తేదీ నుంచి మీ-సేవ కేంద్రాల్లో సదరం స్లాట్స్ అందుబాటు ఉంటాయన్నారు.

సీఎం సహాయనిధి ద్వారా పేదలకు సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలోని ఐదుగురికి పథకం కింద మంజూరైన రూ.1,68,500 చెక్కులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు.

- మియాపూర్

లయన్స్ క్లబ్, హోప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం ప్రేమ్‌నగర్‌కు చెందిన 5 కుటుంబాలకు కుట్టుమిషన్లను లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కరుణాకర్‌గౌడ్, జోన్ చైర్మన్ కొండ విజయ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మల్లేశ్, సుదీర్, వెంకటేశ్, విశ్వనాథ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

- కొండాపూర్

అత్యున్నత వైద్య వసతులు అవసరం

● నేషనల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ మిను బాజ్‌పాయి

మాదాపూర్, ఆగస్టు 3: దేశంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య వసతులు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని నేషనల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ మిను బాజ్‌పాయి అన్నారు. మాదాపూర్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో శనివారం డీఎన్‌బీ వైద్యుల అసోసియేషన్ మూడోవార్షికోత్సవం నేపథ్యంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యులు రోగుల నిష్పత్తిలో భారీ అంతరం ఉన్నదని, ప్రతి జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిసున్నట్లు చెప్పారు. నేషనల్ బోర్డు సైతం వంద పడకల హాస్పిటల్‌లో డీఎన్‌బీ కోర్సుల అనుమతి సులభంగా అందిస్తుందని, వైద్యులు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చదవడానికి సులభతరం అవుతున్నదన్నారు. డీఎన్‌బీ కోర్సు లేని హాస్పిటల్ యాజమాన్యం వారు అనుమతి తీసుకోవాలని పిలుపునిచ్చారు. గోల్డ్ మెడల్ సాధించిన వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు, సమావేశాలు నిర్వహించే స్థాయికి హైదరాబాద్ ఎదిగిందన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన వైద్యులకు సన్మానించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన వైద్యులు, కో – ఆర్డినేటర్లకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు, డాక్టర్ లింగయ్య, జాతీయ ఆలుమ్ని అసోసియేషన్, డాక్టర్ బాలరాజు, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, డాక్టర్ సురేశ్‌కుమార్, కార్యదర్శి, డాక్టర్లు ఖుబ్‌చంద్, రాజగోపాల్, కల్పన రఘునాథ్ ఉన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేషనల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ మిను బాజ్ పాయి

అన్నమాచార్య బావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్నమయ్యపురం విద్యార్థులతో సంకీర్తనలు, నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమం శ్రీవాగ్దేవి నాట్యస్థల్ వారి నృత్యార్చనతో ప్రారంభమైంది. గురువు శైలజ వడ్డానం వారి శిష్య బృందం సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. డాక్టర్ శోభరాజు కళాకారులకు శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.

- మాదాపూర్

విద్యుత్ సమస్యలపై అవగాహన

బాలానగర్/మియాపూర్, ఆగస్టు 3: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఫ్రెండ్స్‌కాలనీలో బోయిన్‌పల్లి డీఈ భిక్షపతి ఆదేశాల మేరకు ఏడీఈ కృష్ణ పర్యవేక్షణలో ఏఈ అఖిల్ అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఏడీఈ, ఏఈ, అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వెంటనే స్పందించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

■ మియాపూర్ : కూకట్‌పల్లి డివిజన్ విద్యుత్ అధికారులు భాగ్యనగర్ సెక్షన్‌లోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీ విద్యుత్ వినియోగదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరా, నూతన బిల్లింగ్ విధానం సహా పలు సమస్యలను వినియోగదారులు అధికారులకు విన్నవించారు. డీఈ చక్రవర్తి మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన బిల్లింగ్ విధానంలో సులువుగా విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహనను కల్పిస్తున్నట్లు వినియోగించుకుని బకాయిలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏడీఈ ప్రసాద్, ఏఈ షాబాజ్ పాల్గొన్నారు.

కళా సదస్సు విజయవంతం చేయండి

కళాకారుల సమస్యల పరిష్కారానికి 7న రవీంద్రభారతిలో కళాసదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రజా నాట్యమండలి ప్రతినిధులు తెలిపారు. శనివారం జగద్గిరిగుట్టలో సమావేశమై కరపత్రాలు పంచారు. సదస్సులో రాయితీలు, గుర్తింపుకార్డులు, ఉద్యోగం, పింఛన్, ఇంటి స్థలం సాధించడంపై చర్చిస్తారు. కళాకారులు, ప్రజాసంఘాల నేతలు సదస్సుకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రాములు, అక్షిత, సదానందం, సాయిలు పాల్గొన్నారు.

- జగద్గిరిగుట్ట

సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్, ఆగస్టు 3 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సమస్యల పరిష్కారంతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు శంభీపూర్‌కృష్ణను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

బెంగాలీ హస్తకళా మేళా..

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, ఆగస్టు 3 : బెంగాలీ హస్తకళా మేళా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేశారు. విశ్రాంత ఐఏఎస్ చందనాఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిల్పారామం, బెంగాలీస్ ఇన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా 'ఎస్పీర్మితి-04' పేరిట రెండు రోజులపాటు కొనసాగనున్నది. మేళాలో బెంగాలీ సాంస్కృతిక ప్రదర్శనలు, చేనేత హస్తకళలు, బెంగాలీ భోజన స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. బెంగాలీ సంస్కృతి, సంప్రదాయాలను అందరికీ తెలిసేలా ప్రతి సంవత్సరం ఈ మేళాను నిర్వహిస్తున్నారు. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబీర్‌కుమార్ చౌదరి, సుపర్ణ సేన్, శిల్పారామం ఇన్‌చార్జి మేనేజర్ అంజిరెడ్డి, పార్థ ప్రతిమ్ మల్లిక్, సుచిస్మితా, తరుణ్, శాంతను ముఖర్జీ పాల్గొన్నారు.

బెంగాలీ మేళాను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చందనాఖాన్

ప్రతి శనివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

కొండాపూర్, ఆగస్టు 3 : హైటెక్‌సిటీలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్‌లో ప్రతి శనివారం గైనకాలజిస్ట్ కన్సల్టేషన్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేశ్ దెగ్లూర్కర్ అన్నారు. శనివారం దవాఖానలో కార్పొరేట్ వర్కింగ్ ఉమన్, వారి కుటుంబసభ్యులకు షీ క్లీనిక్స్ సేవలు ప్రారంభించింది. కార్యక్రమానికి హ్యాష్‌ట్యాగ్ మార్కెటింగ్ వ్యవస్థాపకురాలు ఇషాసిన్హా ముఖ్యఅతిథిగా హాజరై సేవలు ప్రారంభించారు. ప్రతి శనివారం గైనకాలజిస్ట్ కన్సల్టేషన్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు దవాఖాన ప్రతినిధులు తెలిపారు. ఏడాదికోసారి కార్పొరేట్ మహిళలకు, వారి కుటుంబసభ్యులకు హెల్త్ చెకప్‌లపై 30 శాతం డిస్కౌంట్‌పై అందజేస్తున్నట్లు తెలిపారు.

మెడికవర్ దవాఖానలో షీ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న వైద్య బృందం



సేవాభావం.. అభినందనీయం

పేదలకు ఉపయోగపడేలా ఉచిత సేవలు అందించడం అభినందనీయమని పలువురు అన్నారు. జగద్గిరిగుట్ట మఖ్దూంనగర్‌లో శనివారం ఎన్‌కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ జగన్ ప్రారంభించారు. పేదలు ఉన్న ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు, ఆసుపత్రులు ఇలాంటివి చేపట్టాలని కోరారు. డాక్టర్లు ఉదయ్, శరణ్య, వంశీరెడ్డి, బంధవీ నేతలు జైహింద్, పాపుల్ గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

- జగద్గిరిగుట్ట

వివాహిత అదృశ్యం

సరిత రోక్యా

కొండాపూర్, ఆగస్టు 3 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన హర్క రోక్యా తన భార్య సరిత రోక్యాతో కలిసి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి గచ్చిబౌలిలోని చిన్నఅంజయ్య నగర్‌లో నివా సం ఉంటున్నారు. కాగా, సరిత రోక్యా స్థానికంగా హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్నది. ఇదేక్రమంలో ఈనెల 2న ఇంట్లో సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లిన సరిత తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన హర్క స్థానికంగా, స్వగ్రామంలో విచారించగా ఆచూకీ లభించలేదు. గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చే యగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక బాధ్యతతోనే డ్రగ్స్ నిర్మూలన

జగద్గిరిగుట్ట : సామాజిక బాధ్యతతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ సూచించారు. జగద్గిరిగుట్టలో శనివారం మాదకద్రవ్యాల నిర్మూలనపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాలల విద్యార్థులు చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. వాసవీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. మద్యం, గుట్కా, పొగాకుతోపాటు గంజాయి, డ్రగ్స్ మనిషిని అనారోగ్యంపాలు చేస్తాయన్నారు. డ్రగ్స్ వినియోగ సమాచారాన్ని డయల్ 100, ఫోన్ 87126 71111, హెల్ప్‌లైన్ 144 46 నంబర్లకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ హన్మంతరావు, సీఐ క్రాంతికుమార్, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫతేనగర్ ఎల్బీఎస్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం ఫతేనగర్ ఎల్బీఎస్‌నగర్‌లో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ వైద్యశాలల ఆధ్వర్యంలో శిశుమందిర్ పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు.

- బాలానగర్

మొక్కలు నాటడం అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, ఆగస్టు 3 : మొక్కలు నాటడం అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో రెండు మొక్కలు నాటాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ లహరి గ్రీన్ పార్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృక్షో రక్షతి రక్షిత అనే థీమ్‌తో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు స్థానిక కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ప్రదీప్‌రావు, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు మురళీ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లహరి గ్రీన్ పార్క్ అధ్యక్షుడు శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షుడు సీహెచ్.విష్ణు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, కోశాధికారి రవీందర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు

మియాపూర్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు 5 నుంచి 9వ తేదీ వరకు జోన్ వ్యాప్తంగా స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు వస్తాయని, ఈ మేరకు ఆ దిశగా ప్రతి వీధిలో రహదారిలో స్వచ్ఛ పరిసరాలతోపాటు ఆహ్లాదం కలిగించేలా పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో కృషి చేయాలన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంపై జోన్ స్థాయిలో డీసీలు, ఇంజినీరింగ్, పారిశుధ్య, ఎంటమాలజీ, పొదుపు మహిళా విభాగాలతో జడ్సీ ఉపేందర్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 5న జన సమ్మర్థ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, పార్కులు, బస్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు, వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు చేపట్టాలన్నారు. 6న దోమల నివారణ కోసం ఫాగింగ్, నీరు నిల్వ ప్రాంతాల్లో నివారణ చర్యలు, బస్తీలు, బస్తీ దవాఖానల్లో డెంగీ పాజిటివ్ కేసుల గుర్తింపు, వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించాలని జడ్సీ ఆదేశించారు. 7న చెరువుల పరిరక్షణ చర్యలు, వాటి పరిసరాలలో ఉన్న నిర్మాణ, ఇతర వ్యర్థాల తొలగింపు, ఆక్రమణల గుర్తింపు చేపట్టాలన్నారు. 8న రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వయం సహాయక బృందాలు, బస్తీ కమిటీలతో సమావేశాలు నిర్వహించి ప్రజారోగ్యంపై అవగాహన కల్పించాలని, నాలాల్లో పేరుకున్న వ్యర్థాల తొలగింపు, రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీలు సహా ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్ : స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి కోరారు. మున్సిపాలిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్ రత్నావత్ గంగయ్య, కౌన్సిలర్లకు, కార్యాలయ అధికార సిబ్బందితో వేర్వేరు జరిగిన సమావేశంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఆఫీసర్లు, ఎస్ హెచ్‌జీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలలో సకల వసతులు

బోరు పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

మియాపూర్, ఆగస్టు 3 : ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. హైదర్‌నగర్‌లో కోటి నిధులతో ఎంపీపీఎస్ పాఠశాల పునరుద్ధరణ నిర్మాణ పనుల్లో భాగంగా బోర్‌వెల్ పనులను కార్పొరేటర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని జలవాయు విహార్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కాలనీలో సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

నిందితుడి అరెస్టు

దుండిగల్, ఆగస్టు 3 : రాత్రిపూట షెట్టర్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఓ నిందితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉపేందర్‌రావు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన డి.ఆంజనేయులు అలియాస్ అనీస్.. ఆరు నెలలుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో నివాసముంటున్నాడు. తల్లిదండ్రులు పూల వ్యాపారం చేస్తుండగా.. ఆంజనేయులు వారికి చేదోడుగా ఉంటున్నాడు. సరదాలకు డబ్బులు సరిపోక దొంగతనాల బాటపట్టాడు. జూలై 31న, ఆగస్టు 1వ తేదీన అర్ధరాత్రి ప్రగతినగర్‌లోని శ్రీసాయి వెంకటేశ్వర కిరాణం షాపు షెట్టర్ పగులగొట్టి నగదు, సిగరెట్ ప్యాకెట్లను తస్కరించారు. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిజాంపేట్ బస్‌స్టాప్ సమీపంలోని ఓ హోల్‌సేల్ కిరాణం షాపులో ఈనెల 2న ఆంజనేయులు సిగరెట్ ప్యాకెట్లను విక్రయిస్తుండగా.. పట్టుకున్నారు. విచారించగా.. నేరాన్ని అంగీకరించడంతో శనివారం నిందితుడు ఆంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి రూ.10 వేల నగదు, 20 వేల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పోలీసులను బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్,కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

మియాపూర్, ఆగస్టు 3: వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకున్నది. మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ శనివారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లకు చెందిన నందగిరి రాజశేఖర్(21)వ్యక్తిగత పనుల నిమిత్తం శుక్రవారం హఫీజ్‌పేట్‌లోని ఎస్‌బీఆర్ ఓయో హోటల్‌లో దిగాడు. తను ఉన్న హోటల్ గదిలోనే విషం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో రాజశేఖర్ ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇది ఏండ్ల నాటి పోరాట ఫలితం

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఏండ్ల నాటి పోరాటానికి సుప్రీం తీర్పు చక్కని ఫలితాన్నిచ్చిందన్నారు. గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన దళిత సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- మియాపూర్

తీర్పు హర్షణీయం

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 3: మాదిగల చిరకాల కోరిక ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని, మాదిగల కోసం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం వృథాకాలేదని చేగూరి ప్రభాకర్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి హరిజన సేవా సంఘం, హరిజన ఆబాది హౌసింగ్ సొసైటీల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి